37

# సృష్టి అనగా ఈశ్వరేచ్ఛ యొక్క ప్రకటనయే!

పరమాత్మ ప్రేమను ధరణిలో జనులకు
ప్రవహింపజేయుటే పరమభక్తి
ప్రతిమానవుండును బ్రతికి తానుండుట
స్వార్థంబునకు కాదు సంఘసేవ
చేయుటకే యన్న శ్రేష్ఠ భావంబుతో
మెలగుచుండిన మేలుకలుగు
మరచియు తనుదాను మానవసేవకు
అంకితమొసగుటే ఆత్మతృప్తి
సంకుచిత భావములనెల్ల సమయచేసి
సర్వజనులకు ఉపకృతి సలుపకున్న
పుట్టి ఫలమేమి నరునిగా పుడమియందు
యింతకన్నను గురుబోధ యేమి కలదు?

ప్రేమస్వరూపులారా!

మానవత్వము కేవలము స్వార్థమునకై నియమించినదిగా భావించి సత్యనిత్యమైన ఆత్మతత్త్వాన్ని విస్మరిస్తూ ఉంటున్నారు, మానవులు ఈనాడు. మానవజీవితములో అభివ్యక్తము కావలసినది ఈశ్వరభావము. 'సృష్టి' అనగా ఈశ్వరేచ్ఛకు ప్రకటనయే! కనుకనే దీనికి 'ప్రకృతి' అని పేరు పెట్టారు. ఈ ప్రకృతినుండి ఆవిర్భవించిన ప్రతిప్రాణియందుకూడను ఈశ్వరప్రభావమే ఉండి తీరాలి. ఇట్టి ఈశ్వర తత్త్వాన్ని ప్రకటింపజేయు నిమిత్తమై మూర్తీభవించినవాడే మానవుడు. ప్రకృతి చైతన్యము వ్యర్థమైనది కాదు. అహంకారపరమైనప్పుడు వికృతియు, ఆత్మపరమైనప్పుడు సుకృతియు పొందుతున్నది.

srisathyasaivachanamrutam

## మానవుడు యీనాడు సాధించవలసినది దైవప్రీతి

అయితే, ఈనాడు ఈప్రకృతియొక్క చైతన్యమును ఎవరికి మనము అర్పితము గావించాలి? స్వార్థమునకు కాదు. స్వప్రయోజనమునకు కాదు. ఈశ్వరార్పితముగావించాలి. కానీ, ఈనాడు అహంకారపరమైన ఆశలను అభివృద్ధి గావించుకోటంచేతనే మానవత్వము నశించి దానవత్వము, పశుత్వముగా మారి దివ్యత్వమును మరపించి దైవత్వమునకు దూరమై దానవత్వములో జీవిస్తూ ఉంటున్నాము. కనుకనే, మానవుడు వేయు ప్రతి అడుగు ధర్మమునకు విరుద్ధముగా ఉన్నది. ప్రతి ఆశయందుకూడను అభివృద్ధి మార్గమును విస్మరించిపోతున్నది. ప్రతి ఆశ దురాశగా మారుచున్నది. మానవులలో అభ్యుదయ భావములు అడుగంటిపోవుచున్నవి. మానవునియందు ప్రేమ నశించినది. మానవుని మాటలయందు సత్యము సంకుచితమైపోయింది. ఆధ్యాత్మికము కేవలము ఆడంబరముగా రూపొందిపోయింది. కామక్రోధాదిగుణములు అదుపు తప్పి స్వేచ్ఛగా విహరిస్తున్నవి. మానవునియందు చైతన్యము సన్నగిల్లినది. మానవునికి, మానవునికి మధ్యనున్న సంబంధ బాంధవ్యము కృత్రిమరూపమును ధరించింది. నిజము చెప్పాలంటే మానవత్వమే శూన్యమైపోయింది. ఇట్టి తరుణమందు యిట్టి పరిస్థితులయందు మానవుడు దేనిని సాధించాలి? మానవుడు శాంతిని, సుఖమును, ఆనందమును అనుభవించవలెనంటె దేనిని పొందాలి? ఇదే యీనాడు అత్యవసరమైన ప్రశ్న. మనము యీనాడు సాధించవలసినది దైవప్రీతి.

## భగవంతుడు అవతరించటము ప్రేమను బోధించే నిమిత్తమే!

దైవము అవతరించటము కష్టములను, దుఃఖములను బాధలను నివారించి, దుర్మార్గులను హతముచేసి, సన్మార్గులను రక్షించే నిమిత్తమని అనేక పురాణములు, అనేకమంది పెద్దలు బోధిస్తూ వచ్చారు. ఇది సరికాదు. భగవంతుడు అవతరించటము ప్రేమను బోధించే నిమిత్తమే, ప్రేమను నేర్పు నిమిత్తమే! 'ప్రేమయనగా ఏమిటి?' అని ప్రజలకు బోధించే నిమిత్తమై. కనుకనే, అట్టి ప్రేమను మనము పొందినప్పుడే మనకు దుఃఖములు దూరమవుతాయి. పాపములు అంతర్ధానమైపోతాయి, భీతి అనేది మనచెంతకు చేరదు. కనుకనే మనము నేర్వవలసినది దైవప్రీతి. ఎక్కడ దైవప్రీతి కలదో అక్కడనే పాపభీతి సహజముగా నీడవలె

srisathyasaivcharamrutam

వెంటాడుతుంది. ఈ రెండింటియొక్క ఐక్యతచేతనే సమాజములో ఒకనీతి ఏర్పడుతుంది. ఈ ముమ్మూర్తులను ప్రేమించటమే మానవుని ప్రధానకర్తవ్యము. అదియే దైవప్రీతి, పాపభీతి, సమాజనీతి. వీనిని పొందాలంటే తగిన సాధనయేమిటి? మార్గమేమిటి?

**భక్తి, జ్ఞాన, కర్మలయొక్క సమ్మిళిత స్వరూపమే ఉపాసన**

సాధన అని చెబుతూవచ్చారు. సాధన అనగాయేమిటి? మన లక్ష్యమును సన్నిహితం గావించుకోటమే సాధన. మనము ఒక వస్తువును ఆశించినప్పుడు ఆశించిన వస్తువును సన్నిహితం గావించుకోవాలంటే కొన్ని రకములైన క్రియలాచరించాలి. మనము ప్రేమించిన వస్తువుయొక్క విశిష్టతను గుర్తించి దానిపైన విశ్వాసము పెంచుకోవాలి. ప్రేమయే లేకపోయిన విశ్వాసము దేనిపైనా కుదరదు. ప్రేమ, విశ్వాసములయొక్క చేరిక ఒక విధమైన భక్తిగా యేర్పడుతుంది. తద్వారా దానిని పొందే నిమిత్తమై క్రియలలో మనము ప్రవేశిస్తాము. కనుక ప్రేమయే భక్తి. దీనియొక్క విశిష్టతపైనున్న విశ్వాసమే జ్ఞానము. ఈ రెండింటిని అనుభవించే నిమిత్తమై ఆచరించే క్రియలే కర్మలు. కనుక, భక్తి జ్ఞానకర్మలయొక్క సమ్మిళితమైన స్వరూపమే ఉపాసన అని చెప్తూ వచ్చారు.

**అనేకత్వమైన మానవత్వములో ఉన్న దివ్యత్వము ఒక్కటే అన్న సత్యాన్ని గుర్తించాలి**

ఈనాడు మానవుడు ద్వైతమును అభివృద్ధిపరచుకుంటూ పోతున్నాడు. ద్వైతము యేనాటికి మనదుఃఖమును దూరము చేయలేదు. దుఃఖమును మరింత అభివృద్ధి గావించుతుంది. ఆనందమునకు అత్యంత దూరము చేస్తుంది. కనుక, మనము అద్వైతమనే ఏకత్వమును సాధించుటకు తగిన కృషి చేయాలి. ఆ ఏకత్వము ఒక్కటే! అదియే ప్రేమ. ఈ ప్రేమకు ఫలితముగాని, యీ ప్రేమకు మార్గముగాని ఈ ప్రేమకు సాధనగాని ప్రేమయే! మన ప్రేమను యెంతగాపెంచుకుంటూ పోదుమో, మనయొక్క ఆనందము అంతగా పెరుగుతూ పోతుంది. ఈనాడు మన ప్రేమను సంకుచితము గావించుకుంటూ ఉన్నాము. నేను, నావారు అనే దానిని హద్దుగా ఏర్పరచుకొంటున్నాము. ఈ పరిమితిని దాటి 'అనేకత్వమైన మానవత్వములో ఉన్న దివ్యత్వము ఒక్కటే', అనే సత్యాన్ని గుర్తించి అందరిని ప్రేమించాలి. అందరియందు అంతో యింతో ఉన్న ప్రేమ ఒక్కటే! దానినే ఉపనిషత్తులు 'అణోరణీయాన్ మహతో మహీయాన్'

sri sathyasaivachanamrutam

అన్నారు.

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు**
**మేటి వస్తువునందున మేటి యగుచు**
**అంతటను సర్వసాక్షియై అలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ బ్రహ్మయే ఆత్మయగును.**

ప్రకృతి స్వాభావికముగానే తనయొక్క కర్తవ్యమును నిర్వర్తిస్తూ వస్తుంది. దీనిని మరొకరు ఉద్ధరించటముగాని, నశింపచేయటముగాని ప్రోత్సహింపచేయటంగాని జరుగదు. ఇది ప్రకృతియొక్క స్వభావము. ఇది పెరిగి, తరగని అమృతత్వమైన ఆత్మతత్త్వము. ఇట్టి పరతత్త్వమును ప్రకృతికి ప్రబోధించి దీనికి కొన్ని రకములైన గుణములను సృష్టించుకుంటూ వచ్చింది. అవియే సత్త్వరజో తమో గుణములు. ఈ గుణములను ప్రకృతియందు వ్యాపింపచేయవలెనన్న దీనికి కొన్ని ఉపాధులు అత్యవసరము. ఆ వుపాధులే బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే పేరుతో వ్యవహరింప బడుతున్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కేవలం దేహధారులు కాదు. కేవలము గుణోపాధి స్వరూపులు. గుణములయొక్క ఆకారమును ధరించిన దివ్యస్వరూపములే యీబ్రహ్మతత్త్వము, ఈశ్వరతత్త్వము, విష్ణుతత్త్వము. బ్రహ్మమనగా యేదో ఒకవిధమైన చతుర్ముఖుడుగా ఉండి జగత్తునంతా సృష్టిస్తున్నాడు అని పురాణములు వర్ణిస్తూ వచ్చాయి. కాదు, కాదు. ఈ ముమ్మూర్తులు మనయొక్క గుణస్వరూపులే. ప్రాకృతమైన శక్తులు ఐదు ఉంటున్నవి. అవే భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము. అయితే వీనిని సృష్టిక్రమముగా భావించటానికి పూనుకున్నప్పుడు దీనికి విరుద్ధమైన వరుసక్రమము ఏర్పడుతుంది. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి. ఈ సృష్టిక్రమము గురించి ఒక విధముగాను, కేవలము అనుభవముయొక్క క్రమము గురించి మరొక విధముగాను ప్రకృతి మనకు నిరూపిస్తూ వచ్చింది. అదేవిధముగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వర అనే అనుభూతికి ఉండిన యీ ఉపాధులను, సృష్టిక్రమంగా మనము మార్చినప్పుడు ఈశ్వర, విష్ణు, బ్రహ్మగా రూపొందింది.

**హృదయమే ఈశ్వరుడు, మనస్సే విష్ణువు, వాక్కే బ్రహ్మ**

ఇక్కడ ఈశ్వరత్వమనగా ఏమిటి? 'ఈశ్వర స్సర్వభూతానాం' అనింది, గీత. ఈశ్వరుడు



sri sathyasai vachanamrutam

అనగా 'హృదయేశ్వరుడు' అని పేరు. అనుగా సర్వుల హృదయములను ప్రకాశింపచేసేవాడు. అందరి హృదయములందు ఈశ్వరత్వమనే దివ్యశక్తి ఉంటుంది. దీనినే శృతులంతా 'ఆత్మ' అని పిలుస్తూ వచ్చాయి. ఈ హృదయమునుండి మనస్సు ఆవిర్భవిస్తూ వచ్చింది. ఈ మనస్సే విష్ణుత్వమని, 'విష్ణు' అనగా సర్వవ్యాపకుడు అని దీని అర్థము. 'మనోమూలమిదం జగత్', అనగా మనస్సు జగత్తంతా వ్యాపించినది. కనుక, యీ మనస్సునకే విష్ణుత్వమని పేరు. ఈ విష్ణువు నాభినుండి ఉద్భవించినవాడు బ్రహ్మయని ప్రజలయొక్క విశ్వాసము. అనగా యీ మనస్సునుండి ఆవిర్భవించినదే వాక్కు. వాక్కే బ్రహ్మస్వరూపము. కనుకనే

**శబ్దబ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి**
**నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి**

అని వాక్కును బ్రహ్మతత్త్వముగా పోల్చుకుంటూ వచ్చారు. ఏతావాతా ఈశ్వర, విష్ణు, బ్రహ్మ అనగా యేమిటి? హృదయమే ఈశ్వరుడు, మనస్సే విష్ణువు, వాక్కే బ్రహ్మ. ఈ మూడింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే దివ్యమైన ఆత్మతత్త్వము. కనుక, బ్రహ్మయే మనకు గురువు. విష్ణువే మనకు గురువు. ఈశ్వరుడే మనకు గురువు. ఇదియే అనేకత్వములోపల ఏకత్వముగా భావిస్తూ వచ్చారు. ఇట్టి పవిత్రమైన అర్థములతో కూడిన ఒక శ్లోకమునకు ఏదో గురుత్వమును ఒక అల్పవిషయముగా భావించి, అనేకత్వముగా విభజించి, నానాత్వమును స్వీకరించి యథార్థమును విస్మరిస్తూ వచ్చారు.

**గురుర్బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్ దేవోమహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః**

దీని అంతరార్థమేమిటి? గురుర్ బ్రహ్మ అనగా సృష్టికర్తయైన బ్రహ్మ కాదు. వాక్కే మనకు నిజమైన గురువు. గురుర్ విష్ణుః అనగా మనస్సు, సర్వవ్యాపకమైన మనస్సు, సర్వత్రా తిరిగే మనస్సు. సర్వభూతములందు ఉండే మనసు. సర్వక్షేత్రములయందు ప్రతిష్ఠ అయి ఉండిన మనసు. అదే విష్ణుత్వము. గురుర్ దేవోమహేశ్వరః. అదే హృదయస్థానము. గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః. ఈ మూడింటియొక్క ఏకత్వమైన దివ్యత్వమే ఆత్మతత్త్వము. అదే మనకు గురువు, అని చెప్పారు.

sri sathyasai vachanamrutam

గురుత్వమనగా అర్థమేమిటి? అంధకారము నిర్మూలము గావించే తత్త్వమే గురుత్వము. సత్త్వ రజ స్తమో గుణములనే మూడుగుణములుండినంతవరకు అంధకారము తప్పునది కాదు. యీ మూడు గుణములకు అతీతమైన స్థాయిని మనము పొందినప్పుడు అదే గురుత్వమన్నారు. లేక యీ మూడు గుణములయొక్క ఏకత్వమును భావించినప్పుడే యిదే నిజమైన గురుబోధ. ఈ మూడింటియొక్క ఏకత్వము, అదే 'మమాత్మా సర్వభూతాంతరాత్మ,' అది నిజమైన ఆత్మతత్త్వము. సర్వులయందు ఉండినది ఒక్కటే! 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ,' యిలాంటి ఏకత్వమును మనము విస్మరించి, భిన్నత్వాన్ని అభివృద్ధిపరచుకొని అశాంతికి గురైపోతున్నాము.

**జగత్తంతయు త్రిగుణములయొక్క చేరికయే!**

త్రిగుణములయొక్క వికారముచేతనే యీ ప్రపంచము సృష్టింపబడి, పోషింపబడి, నశింపబడుతోంది. ఈ సృష్టికంతయు త్రిగుణములే పునాదులు. త్రిగుణములే ఆధారములు. త్రిగుణములే ప్రాణములు. ఈ త్రిగుణములయొక్క స్వరూప, స్వభావములతో ప్రకృతియొక్క తత్త్వము వికసిస్తూ వస్తున్నది. ఈ త్రిగుణములయొక్క కార్యకలాప సముదాయమే ప్రపంచము. కనుక, వేదము త్రిగుణములయొక్క స్వరూప స్వభావములతో, విశేష వికారములతో, విలాస హాసాలతో యీ జగత్తును ప్రకటింపజేస్తూ వస్తోంది. కనుక, జగత్తంతయు త్రిగుణములయొక్క చేరికనే! దీనినే మూడు రంగులుగా, మూడు వర్ణములుగా విభజిస్తూ వచ్చారు. సత్త్వగుణము విష్ణువని భ్రమిస్తున్నారు, యీనాటి లోకులు. సత్త్వగుణము విష్ణువు కాదు. అదియే ఈశ్వరత్వము. ఇది మాయకు లోబడనిది. ఇది యోగనిద్రలో చిత్‌శక్తిని సంపాదించి కేవలం శుద్ధాత్మగా రూపొందుతూ వస్తుంది. కనుకనే శుద్ధతత్త్వమనేదే ఈశ్వరత్వము. ఇదే మానవుని హృదయమును వికసింపచేస్తూ, ప్రకాశింపచేస్తూ ఉంటుంది. ఇదే సత్త్వగుణము. సత్త్వగుణమునకు చిహ్నము, తెలుపురంగు.

ఇంక రజోగుణము. రజోగుణమనగా యేమి? రాగములచేత, విరాగములచేత విజృంభించేది. 'రజోగుణము బ్రహ్మ' అని చెబుతూ వచ్చారు. అది సరికాదు. రజోగుణము విష్ణువే! శంఖు చక్ర గదా పద్మములతో కూడినది కనుక విష్ణుత్వమనగా కేవలము అలంకార స్వరూపము. కనుకనే విష్ణువునకు విశ్వంభరుడని పేరు వచ్చింది. విశ్వంభర అనగా విశ్వమును

sri sathyasaivachanamrutam

కాపాడేవాడు. విశ్వమును పాలించేవాడు. రజోగుణములతో కూడినవాడు విష్ణువు. దీని రంగు ఎరుపు.

ఇంక బ్రహ్మ. ఇది తమోగుణమే! తమోగుణమనగా యేమిటి? అంధకారముతో కూడినది. ఇది మమకార, అభిమానములతో కూడినది. మమకార, అభిమానములుండినప్పుడే సృష్టి జరుగుతూ ఉంటుంది. మమకార, అభిమానములు లేనిచోట సృష్టియే జరుగదు. మమకార, అభిమానములే తమోగుణముయొక్క లక్షణములు. ఈ తమోగుణమునకు చిహ్నము, నలుపురంగు. తెలుపు, ఎరుపు, నలుపు యీమూడు రంగులే ప్రధానమైన రంగులు. మిగిలిన అన్ని రంగులు యీ మూడు రంగులలో ఏకమైనట్టివే. అదేవిధముగనే లోకములోపల సత్త్వగుణము కలిగినవారు, రజోగుణము కలిగినవారు, తమోగుణము కలిగినవారు అని మానవులను మూడు విధములుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన అన్ని రంగులు కూడను యీ మూడు రంగులలో యిమిడి ఉన్నాయి.

**సర్వజీవులయందు ఉండినది ఒకే పరమాత్మయనే సత్యమును గుర్తించి వర్తించటమే సత్యవతీ సాధన**

అయితే యీ వర్ణములను, యీ విధమైన పరిస్థితులను ఏకత్వము గావించటానికి ఒక్కటే ఒక మార్గము. దీనిని విచారణ చేస్తూ కొన్ని మార్గములను ఋషులు ప్రబోధిస్తూ వచ్చారు. అవి ఐదు మార్గములు. సత్యవతి, అంగవతి, అన్యవతి, నిదానవతి, ఏకస్వరూపిణి. ఈ సత్యవతి అనేది ఒక సాధన. ఏమిటి యీ సాధన? పాలలో వెన్న ఏవిధముగా ప్రతి చుక్కయందును లీనమై ఉంటున్నదో అదేవిధముగా సర్వత్ర, సర్వప్రాణులయందు సర్వపదార్థములందు దైవత్వము సూక్ష్మరూపముతో ఉన్నదనే సత్యమును నిరూపణ చేసేది. కనుక, భగవంతుడనగా సర్వాంతర్యామి, సర్వభూతాంతరాత్మ, సర్వజ్ఞుడనే సత్యమును నిరూపించేదే సత్యవతి సాధనా మార్గము. భగవంతుడు ఏదో ఒక ప్రత్యేకమైన స్థానమునందు ఉన్నాడని, ఒక వ్యక్తియందున్నాడని, ఒక జీవుని యందున్నాడని భేదమును పాటించరాదు. సర్వత్రా ఉంటున్నాడు. కనుక, సర్వజీవులయందు ఉండినది పరమాత్ముడనే సత్యాన్ని గుర్తించి వర్తించటమే ఈ సత్యవతీ సాధనయొక్క సరియైన అంతరార్థము.

sri sathyasai vacharamrutam

**పంచభూతములు పరమాత్మ స్వరూపములేనని విశ్వసించి ఆరాధించటమే అంగవతీ సాధన**

ఇంక, అంగవతీ సాధన. అనగా పంచ భూతములుంటున్నవి. ఆకాశము వాయువు, అగ్ని, జలము, పృథ్వి. ఈ ఐదింటియందును దైవము ఒక్కొక్క రూపము ధరించి ఒక్కొక్క అంశముతో ఉంటున్నాడు. ఆకాశమనే యీ ప్రకృతియొక్క శక్తినందు ఓంకారమనే శబ్దస్వరూపుడై ఉంటున్నాడు. శబ్దమునకు ఆధారము, శబ్దమునకు నిలయము ఆకాశమే! కనుక, ప్రణవ స్వరూపమనేది ఆకాశమునుండి ఆవిర్భవించినది. వాయువు, యిందులోపల జీవశక్తి యిమిడి ఉంటుంది. అదే ఆక్సిజన్, హైడ్రోజన్ అని చెప్తూ ఉంటారు. ఈ ఆక్సిజన్ గాలియొక్క చిత్‌శక్తియే! గాలిలో భగవంతుడు ప్రాణస్వరూపుడుగా ఉంటున్నాడు. ఎవరైనా స్పృహతప్పి పడినప్పుడు చుట్టూ ఉన్న జనాన్ని కొంచెం దూరం పొమ్మని గాలి విసురుతాము. ఆ గాలివల్ల ప్రాణశక్తి ఉద్భవిస్తుందని దీనియొక్క అనుభూతి. కనుక, గాలిలో భగవంతుడు ప్రాణశక్తిగా ఉంటున్నాడు.

అగ్నిలో హెచ్చరిక శక్తిగా ఉంటున్నాడు. ఏకొంచెం అగ్ని యెక్కడ ఉండినప్పటికి చాలా జాగ్రత్తగా ఉంటాము. తెలిసో, తెలియకో చేయి పెట్టిన తక్షణమే మనకు జాగ్రత్త బయలుదేరుతుంది. అగ్నిలో జాగ్రత్ స్వరూపుడుగా ఉంటున్నాడు.

జలములో ప్రజ్ఞాశక్తిగా ఉంటున్నాడు. అదియే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. ఈ ప్రజ్ఞ అనేది జలముద్వారానే మనకు ఆవిర్భవిస్తూ ఉంటుంది. స్పృహతప్పి పడిపోయినప్పుడు పడినవారికి జలము త్రాపుతారు. జలము తలపైన జల్లుతారు. ఇది ప్రజ్ఞాశక్తిని తిరిగి తెప్పిస్తుంది.

ఐదవది ప్రకృతి. ప్రకృతియందు చైతన్యశక్తి ఉంటున్నది. కనుక యీ ప్రజ్ఞాశక్తి, జాగ్రత్‌శక్తి, చేతనాశక్తి, శబ్ద శక్తి, జీవశక్తి యీ ఐదు కూడను భగవంతుని యొక్క స్వరూపములే! ఈ పంచభూతములే పరమాత్మయొక్క స్వరూపమని విశ్వసించి ఆరాధించేవారే అంగవతీ సాధకులని చెప్తూవచ్చారు.

**భగవంతుని కొన్ని గుర్తులు, చిహ్నములు ఆధారముగా ఆరాధించటం అన్యవతీ సాధన**



sri sathyasai vachanamrutam

అన్యవతి మూడవది. కొన్ని గుర్తులను, కొన్ని చిహ్నములను ఆధారము చేసుకొని భగవంతుని ఆరాధించేవారు. ఈశ్వరుడనగా కేవలము త్రిశూలధారి, ఢమరుకము, త్రినేత్రము అనే కొన్ని గుర్తులను తీసుకొని ఇవి శివునియొక్క స్వరూపమని భావిస్తూ ఉంటారు. శ్రీరాముడనగా కోదండమును ధరించినవాడని గుర్తుపెట్టుకుంటారు. కృష్ణుడనగా కేవలము మురళి ధరించినవాడు, నెమలి పింఛమును ధరించినవాడు అంటారు. ఈ విధముగా ఒక్కొక్కటి ఒక్కొక్క రూపానికి ఒక్కొక్క చిహ్నంగా భావించుకునేదే అన్యవతి.

**నవవిధ భక్తిమార్గములద్వారా భగవంతుని ఆరాధించటమే నిదానవతీ సాధన**

ఇంక నిదానవతి. యీనాడు లోకములో సామాన్యముగా ప్రతి మానవుడు ఈ సాధనలో పాల్గొంటూ ఉంటాడు. అదియే

> **శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
> **అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఈ నవవిధమార్గములే నిదానవతియొక్క సాధనలని భావిస్తూ వచ్చారు.

**ప్రతి వ్యక్తికూడను ఈశ్వర స్వరూపమేనని భావించి ఆరాధించటమే స్వరూపాత్మక జ్ఞానము**

స్వరూపాత్మక జ్ఞానము, ఐదవది. 'సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షిశిరోముఖమ్' అనగా ప్రతి అంగముకూడను, ప్రతి వ్యక్తికూడను ఈశ్వరస్వరూపమే, దివ్యమైన భగవత్ స్వరూపమే! ఇదే ఏకత్వమైన ఆత్మతత్త్వమని నిరూపిస్తూ వచ్చారు. అన్ని పాదములు అతనివే, అన్ని హస్తములు అతనివే, అన్ని శిరస్సులు అతనివే, అన్ని నేత్రములు అతనివే! అనగా మానవులయొక్క స్వరూపములంతా దైవముయొక్క స్వరూపములే!అని భావించటం. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ' అన్నారు. అందరూ దైవస్వరూపులే! దైవమునుండి ఆవిర్భవించిన యీ మానవత్వము దైవత్వముగా విశ్వసించటానికి తగిన కృషి చేయాలి.

మాటలులేని హృదయమైనా భగవంతుడు అంగీకరిస్తాడుగాని, హృదయములేని మాటలను, ప్రార్థనలను అంగీకరించడు. ప్రేమస్వరూపులారా? మానవునియందున్న మానవత్వమునే గుర్తించుకోలేని మూర్ఖుడు, మానవత్వమునందున్న దైవత్వమును యేరీతిగా గుర్తించగలడు? మానవునియందున్న మానవత్వమును మొట్టమొదట గుర్తించటానికి



sri sathyasai vachanamrutam

ప్రయత్నించాలి. అప్పుడే దివ్యత్వమనేది మనకు అర్ధమవుతుంది. ఇదే నిజమైన విద్య. విద్య అనగా దయామయునిగా తీర్చిదిద్దేదే విద్య. మనము 'ప్రార్థన', 'ప్రార్థన' అంటున్నాము. ప్రార్థన అనగా ఏమిటి? యాచించటము కాదు. ఆత్మానందమునకు చిహ్నము. మేల్కొలపటము. అనంతత్వాన్ని ప్రసరింపచేయటము. ఆనందములో మునగటము. అంతేకాని, ప్రార్థన అని చెప్పి హృదయములేని ప్రార్థన చేస్తే ప్రయోజనము లేదు. మాటలు లేని హృదయమైనా భగవంతుడు అంగీకరిస్తాడు కాని హృదయములేని మాటలు, ప్రార్థనలు అంగీకరించడు. అందుకనే భగవంతుని 'హృదయేశ' అన్నారు. హృదయేశునియొక్క తత్త్వాన్ని మనము విశ్వసించినప్పుడే యీ దివ్యత్వమనేది కొంతవరకు వ్యాపింపచేయకలుగుతాము . ఎవరిని దూషించినా భగవంతుని దూషించినట్లే! ఎవరిని ప్రేమించినా భగవంతుని ప్రేమించినట్లే! కనుక, ప్రేమతత్త్వమును మనము పెంచుకోవాలి. అసూయ అనే దానవ గుణమును మనము యేమాత్రము ప్రవేశింపచేయరాదు. 'అసూయ' చేరిన మానవుని హృదయము విజ్ఞానమును నశింపచేస్తుంది. రెండవది మరొకటి ఉంటున్నది. ఈ రోగమునకు యే ఔషధము పని చేయదు. ఏవైద్యుడు దీనిని నయము చేయలేడు. ఏవైద్యమునకు లొంగనిది ఒకటి ఉంటున్నది. అదే అహంకారము. ఈ అసూయ, అహంకారము మానవునియందు ఉండినంతవరకు ఆత్మజ్ఞానమనేదిగాని, విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానములు గాని వికసించటానికి అవకాశములేదు. ఈ రెండు భూతములు చేరటంచేతనే మానవత్వమును వారు విశ్వసించలేకపోతున్నారు. మానవత్వమును గుర్తించలేకపోతున్నారు. మన దేహమనేది ఒక దేవాలయమే! ఈ దేహమనే దేవాలయములో హృదయమనే స్థానములోపల దివ్యత్వమనే ఈశ్వరత్వము ఉంటున్నది. త్రిగుణ స్వరూపములైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు యిందులో నివాసము ఉంటున్నారు. 'బ్రహ్మ ఒక చోటున, విష్ణువు వైకుంఠములోను, ఈశ్వరుడు కైలాసములోను ఉన్నాడు' అని భ్రమించుకోటం కేవలము అజ్ఞానముయొక్క లక్షణము. వాళ్లుకూడా ఒక్కొక్క కాలనీలంతా కట్టుకొని ఒక్కొక్క దగ్గర ఉంటున్నారంటే వారికి, మానవులకు యింక భేదమేమి? నాదికైలాసము, నీది స్వర్గము, నీది వైకుంఠమని వారిలోకూడా భేదములుంటుంటే యింక మానవులకంటె వారు హెచ్చైనవారు ఎట్లా అవుతారు? గుణోపాధి స్వరూపుడైన ప్రతి మానవునియందు వారు ముమ్మూర్తులుగా ఉంటూ వస్తున్నారు. దేహమనే దేవాలయము ఒక్కచోట కట్టినది కాదు, It is

a moving temple. ఎక్కడకు వెళ్ళినా అక్కడ ఉంటున్నది యీ temple. కనుక, భగవంతుడు మన జంటనే, వెంటనే, యింటనే, కంటనే ఉంటున్నాడనే సత్యాన్ని మనము గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. మనమే దైవస్వరూపులము. అంతవరకు మనము పోయినప్పుడే యీ యథార్థమైన పూర్ణత్వమును మనము పొందగలము. ఆ పూర్ణత్వమును మనము గుర్తించగలము. అంతవరకు పోకుండా, కేవలము ఉండిన స్థానములోనే ఉంటుండి చిట్టిబాబు చెప్పినట్టుగా ఎప్పుడు చూచినా doubting Thomasవలె అన్నింటియందు doubts, doubts, doubts ఉండినంతవరకు వానికేమాత్రము శాంతి, సుఖములు లభించవు. 'దైవము మనమే, మనమే దైవము', అనే సత్యాన్ని విశ్వసించి ప్రతి కర్మయందు మనము ఏకత్వమును భావించాలి.

**మానవులందరూ ఐకమత్యముగా ఉంటూంటే సాధించలేనిది ఏముంది?**

దివ్యాత్మస్వరూపులారా! మనము అనేక విధములైన సాధనలు చేస్తున్నాము. యింకపైన సాధనలతోకాదు, ఆచరణలో పెట్టాలి. ఏది చెబుతున్నామో, ఏది తలుచుచున్నామో, ఏది మనము చేస్తున్నామో ఈ మూడింటియొక్క ఏకత్వమును మనము నిరూపించాలి. అదే The proper study of mankind is man. అప్పుడు నీవు మానవునిగా రూపొందుతావు. ఈ మూడింటియొక్క ఏకత్వము లేకపోతే 'మనస్ అన్యత్, వచస్ అన్యత్, కర్మణ్ అన్యత్ దురాత్మనం.' నీవు దురాత్ముడుగా మారిపోతావు. అందుకొరకే heart, head, hand (యివే 3H) ఈ మూడింటియందు సరైన ఏకత్వమును ఆచరణలో మనము చూపించి ఆదర్శము నిరూపించాలి. ఈనాడు ఆధ్యాత్మికమంతా కేవలము ఆడంబరముగా రూపొందుతూ ఉంటున్నది. కావలసినన్ని ఉపన్యాసములు చెబుతున్నాము. కావలసినన్ని సేవలు చేస్తున్నాము. భజనలు జరుపుతున్నాము. యింకా యింకా అనేక విధములైన సాధనలు చేస్తున్నాము. యిన్ని చేసి ప్రయోజనము ఏమిటి? ఈ మూడింటి ఏకత్వము లేక ఈ సత్త్వరజో తమో గుణములయొక్క ఏకత్వము మనము అనుభవించాలి. అప్పుడే మనకు ఆనందము. అప్పుడే మనకు ఆత్మసందర్శనము. ఆత్మ సందర్శనమునకు మనము ప్రత్యేకముగా ఒకచోటుకు పోనక్కరలేదు. ఆత్మ ఒక చోటునుండి మరొకచోటుకు కదిలేది కాదు. దైవము ఎక్కడినుంచో వచ్చి దర్శనము యిస్తాడని భావించరాదు. సర్వత్ర వుండినవానికి ప్రయాణము చేయవలసిన అవసరము యేముంటున్నది? రాకపోకలు



srisathyasaivachanamrutam

లేని శక్తి, దైవత్వము. కనుక మనము ఆచరించినప్పుడు దానికి మనము అర్హులమవుతాము. ఐకమత్యము కావాలి. ఏకత్వములో ఆనందము యిమిడి ఉంటున్నది.

**ఐకమత్యమే సుఖమందలి క్షేమంబు**
**ఎంతకార్యమైన నెగ్గవచ్చు**
**చిన్న చీమలన్ని సర్పంబునున్ బట్టి**
**చంపుచుండుట లేదె జగతియందు**

ఐకమత్యముగా అందరూ ఒక్కటిగా చేరినారంటే ఎంత సుఖము! నావెనుక యింకా పదిమంది ఉన్నారనే ధైర్యము ఆనందము, ఉత్సాహము, ప్రోత్సాహములను చేకూరుస్తుంది. అందరు ఐకమత్యముగా పనిచేసి యెంతటి కార్యమునైనా సాధించవచ్చు. చిన్నచిన్న చీమలన్నీ కలసి పెద్ద సర్పాన్ని చంపేస్తుండేది మనము చూస్తున్నాము. కనుక మానవత్వమనేది ఐకమత్యముగా ఉంటుంటే మనము సాధించలేనిది యేమిటుంది? జగత్తులో ఈ ఐకమత్యము ఎప్పుడు మనకు లభిస్తుంది? మన హృదయాలు పవిత్రము గావించుకున్నప్పుడే ఐకమత్యము మనకు లభిస్తుంది. ఈ హృదయాలు పవిత్రమైనప్పుడే దివ్యత్వమనేది అందులో ప్రవేశింప చేసుకుంటాము. కనుక unity నుండి putiry, purity నుండి divinity ఈ మూడింటియందు మనము అభివృద్ధి కావాలి. ఈనాడు మనలో unity లేదు, purity లేదు divinity అంతకంటె లేదు; only community ని పట్టుకొని అల్లాడుతున్నాము, 'వీడు నావాడు, వాడు నావాడని.' యిదా మనము సాధించవలసినది? ఈ తుచ్ఛమైన భావములు దూరము చేసి మనమందరము ఒకే దైవముయొక్క బిడ్డలము, మన అందరియందు ఉన్న దైవము ఒక్కడే అని జాతి, మతము, కులము, వర్గము అనే వాటిని దూరముగానెట్టి అందరూ అన్నదమ్ములవలె, ఒకే ఆత్మస్వరూపమువలె మెలగినప్పుడే మానవత్వము. ఆనాడే దేశము నిత్యకళ్యాణముగా రూపొందుతుంది. కనుక, యీ సంకుచితమైన భావములు మనము నెట్టివేయాలి. అందరిని ప్రేమిస్తూ రావాలి. అంటే ఏదో వికారమైన ప్రేమలో పాల్గొని ప్రమాదములు కొని తెచ్చుకోకూడదు. అనగా ద్వేషము లేకుండా చూచుకోవాలి. ఈ విధమైన దైవతత్త్వమును మనము పెంచుకోవాలి. అప్పుడే మనయొక్క జీవితము, మనయొక్క దివ్యత్వము ఏకత్వముగా మారిపోయి ఆనందము చేకూరుస్తుంది.

srisathyasaivacharamrutam

**బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నీ గుణములయొక్క స్వరూపములే!**

ప్రేమస్వరూపులారా! ఏదో 'గురుపూర్ణిమ, గురుపూర్ణిమ' అనుకొని బాహ్యమైన గురువులనంతా చేర్చుకొని, ఏవో కొన్ని పూజలు పునస్కారములని యీ అల్పమైన కార్యములలో మన జీవితమును వ్యర్థము చేయరాదు. గురువు ఒక్కడే! దైవము ఒక్కడే గురువు! ఆ గురువు నీవే! ఆ గురుత్వమనే దైవత్వము నీలోనే ఉంటుంటే నీవు ఎక్కడో బయటి ప్రపంచములో వెతకటానికి ప్రయత్నిస్తున్నావు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపులు నీయొక్క గుణములే! నిన్ను హతము చేసేది కాని, పోషించేది గాని, రక్షించేది గాని యీ గుణములే! మన ప్రవర్తనలు సత్క్రమమైన మార్గములో పెట్టుకున్నప్పుడు అదే రక్షిస్తుంది. అదే విష్ణుత్వముగా మారిపోతుంది.

**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తాను చేయు పనుల తగిలియుండు**
**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**తాను చేయు పనుల తగిలియుండు**

కనుక పాపము, దేవుడు అని ప్రత్యేకముగా ఎక్కడో లేదు. మనము చేసే పనులయందే మన సంకల్పములయందే అవి ఆయా స్వరూపాల్ని ధరిస్తున్నాయి. అలాంటి తత్త్వమును మనము విశ్వసించాలి. 'నామంచికి, నా చెడ్డకు నా ప్రవర్తనే కారణము. నా అధఃపతనమునకు గాని, నా అభివృద్ధికి గాని నా గుణములే కారణము,' అని విశ్వసించి మన గుణములను సత్క్రమమైన మార్గములో ప్రవేశపెట్టుకోవాలి. ఈ సమాధానము నీకు నీవే చెప్పుకోవాలి. మన కష్టములు దూరము చేసుకోటానికి గాని, సుఖమును సమీపింపచేసుకోటానికి గాని మన ప్రవర్తనయే కారణము.

**ఉన్నది ఒకే దైవమనే సత్యమును మనము గుర్తించాలి**

ప్రేమస్వరూపులారా! సర్వమతముల సారము, సర్వమార్గముల గమ్యము, సర్వ ఉపదేశముల తత్త్వము ప్రేమయే! ఆ ప్రేమ తత్త్వమును మనము ఈనాడు అభివృద్ధి గావించుకోవాలి. మనము యితరులయొక్క నూరు దోషములు వెతికేదానికంటె మనయందున్న ఒక్క దోషమును వెతుక్కుంటే మనము ధన్యులౌతాము. కాని, అలాంటి పవిత్రమైన పని మనం

sri sathyasai vachanamrutam

చేయటంలేదు. యితరులయొక్క దోషములను ఎంచటమే ప్రధాన కర్తవ్యముగా విశ్వసిస్తున్నాము. నీ దోషమును నీవు తెలుసుకో! దాన్ని తీసివేయి! ఉత్తమమైన భావములను పెంచుకో! అది ప్రేమద్వారానే ప్రాప్తిస్తుంది కాని, మరొక మార్గములో లభ్యముకాదు. దివ్యాత్మస్వరూపులారా! ఎలాంటి కష్టసమయమునందుగాని, ఎలాంటి బాధలయందు గాని ఎలాంటి పరిస్థితులయందుగాని దైవమును వదలకూడదు.

**హెచ్చుగ సంపదలొచ్చినగాని - ఏనుగు గుఱ్ఱము లెక్కినగాని**
**పిచ్చోడని పేరొచ్చినగాని - ప్రియముతో పెద్దలు పొగిడినగాని॥**
**దేవుని మరువకురా-ఉన్నది దైవము ఒక్కడురా॥**
**దుష్టజనులు దూషించినగాని - దోషరహితుడై ఉండినగాని**
**కష్టములెన్నో వచ్చినగాని - కాయము వ్యాధుల చిక్కినగాని**
**దైవమును వదలకురా - ఉన్నది దైవము ఒక్కడురా॥**
**యోగాభ్యాసము చేసినగాని - భాగవతాదులు చదివినగాని**
**పండితుడని బిరుదొచ్చినగాని - పాపిష్టోడని అన్ననుగాని**
**దేవుని వదలకురా - ఉన్నది దైవము ఒక్కడురా॥**
**నిందకు లోబడి నిలచినగాని - నిందుచదువులే చదివినగాని**
**నిండుకుండవై యుండుమురా - నీవు ఎండని కుండగ ఉండకురా**
**దైవమును వదలకురా - ఉన్నది దైవము ఒక్కడురా॥**

ఇలాంటి దైవత్వమును మనము యేనాటికి మరువకూడదు. ఉన్నది ఒకే దైవమనే సత్యమును మనము గుర్తించాలి. నాలోపల, వెలుపల సర్వత్ర ఉండినది దైవమే అనే సత్యమును గుర్తించాలి. కేవలము దేహతత్త్వమును మాత్రమే గుర్తించుకొని నేను మానవుడనని ఆలోచన చేయకూడదు.

**జనుడు తనను తాను నరుడనియే తలచినాడు**
**ఏ దెరిగిన నరజన్మము సార్థకమగునో తెలియలేదు**
**నరజన్మమునందు పుట్టి నరజన్మమునందు పెరిగి**
**నరసింగములైనవారు తొలిసంగతి మరచినారు**

srisathyasaivachanamrutam

**కులమత భేదములు పెంచి అసురత్వము స్వీకరించి**
**సమరాలను స్వాగతించి శాంతిసభలు జరుపుతారు**
**తనకొరకై బ్రతుకువాడు మనుజుడెట్లౌనురా?**

తనకోసము బ్రతికేవాడు మానవుడౌతాడా? జగత్తుకోసం మనము బ్రతకాలి. జగత్తే లేక మనము ఎక్కడ ఉంటాము? జగత్తులో మనము ఒక్కరనే సత్యాన్ని గుర్తించాలి. సమాజము ఏమైనా అయిపోనీ, నేను బాగుండాలంటే నీబాగు ఎక్కడనుండి వస్తుంది? ఏకాకిగా జీవించటమనేది సంకుచితమైన జీవితమే! దైవమనే పదమునకు అర్థము, సమిష్టి స్వరూపము. అనగా దృశ్యకల్పితమైన యీ జగత్తంతా సత్‌శక్తిలో, చిత్‌శక్తిలో ఏకమైపోవటమువలన దైవత్వముగా మారిపోతుంది. కనుపించే జగత్తే matter. ఆ చిత్‌శక్తే being అనగా matter+being = God అన్నారు. దైవము ప్రేమస్వరూపుడు. ప్రపంచమంతా శ్రీమయమే! మన దృష్టి అంతా ప్రేమమయమే! వ్యక్తిగతమైన భేదములచేత విరోధముగా భావిస్తున్నామే గాని సృష్టిలో ఉన్నదంతా ప్రేమనే! ఏ విధముగా మనకన్నులకు వేరువేరు కలర్‌గ్లాసెస్ వేసుకుంటే వేరు వేరు రీతిగా కనుపించినట్టుగా కోపము వచ్చినప్పుడు ఒకరీతిగా, ద్వేషము వచ్చినప్పుడు ఒక రీతిగా, ప్రేమ వచ్చినప్పుడు ఒకరీతిగా యివి glasses మాదిరి మారుతున్నాయి. నిజముగా దృష్టి ఒకటే, అదే ప్రేమ దృష్టి! కనుక, ప్రేమ దృష్టిని మనము పెంచుకోవాలి. మన జీవితము ప్రేమమయముగా మారుతున్నప్పుడు జగత్తంతా బ్రహ్మమయముగా మారుతుంది.

**(తేదీ. 29-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam